


ఆ రోజు మా ఇంటి గజ్జికుక్క ఒకటి చచ్చిపోయుంది. మా వాటా వైపే గాలి కొడుతూండటం వల్ల ఇల్లంతా ధుర్గంధం కొడుతూంది.

ఏవండీ, ఇంటి అవతల కుక్క చచ్చి పడుంది. ఎత్తిం చేయమని ఆయన్నడ గలేం ? అంటూ నిద్రలేపింది మా ఆవిడ.

ప్రొద్దున్నే ఇల్లుగలాయన వాటాలో కెళ్ళటం నా కెందుకో ఇష్టంలేక, సాయంత్రానికి ఆయనే ఎత్తిం చేయక పోతాడా, అనుకొని, ఆఫీసు కెళ్ళి పోయాను.

షుమారు పదేళ్ళ క్రితంకట్టించారట ఆ ఇంటిని ఆనందరావుగారు తన పేరును అక్షరాలా ఔననిపించుకున్న ఆనంద రావు, ఆనంద రావుగారు. ముప్ఫయ్యేళ్లు తాసిల్దారీచేసి, అంత పిల్లలకు ఖర్చుపెట్టి, ఇంత వెనకేసుకొని, నిర్విరామంగా మారి పోతూన్న ప్రపంచాన్ని అలామాగన్నుతో చూస్తూ కాలం వెళ్ళబోస్తున్న అదృష్ట శాలి ఆయన.

తెల్కేసుకొని ఇద్దరు బిడ్డల్ని కన్న పార్వతమ్మకు మంచి భర్త ఆయన. కొడుకు ఢిల్లీలో ఏదో ఉద్యోగంలో వున్నాడట. పాతికవేల కట్నం ఇచ్చి ఆటీవలి కూతురిపెళ్లి ఘనంగా చేశారు. ప్రస్తుతం కొడుకు పెళ్ళికోసం తాపత్రయ పడుతున్నారు ఆనందరావుగారు. కానీ, బేరం లాభసాటిగా రావటం లేదట. ముప్పయివేలకు తక్కువైతే తన అమ్మం తొక్కనవసరం లేదంటారు ఆనందరావు. పదివేలకు ఎక్కువైతే. తమ మిగిలి ఇద్దరు బిడ్డల్ని పీకపిసికి నుయ్యిలోకి గెంటేయాల్సొస్తుందని అవతలివాళ్ళ రాయబారం.

ఇల్లు మాకు అద్దెకిచ్చేప్పుడే ఇంటి విషయమై చీటికి, మాటికి తనతో పితూరీలు చెయ్యకూడదనీ — కరెంటు నీళ్ల ఛార్జీలు సగం భరించాలనీ - ఇలా ఎన్నో కండిషన్లు పెట్టాడాయన, అందుకని, ప్రొద్దున్నే వెళ్లి ఆయన్తో చచ్చిన కుక్క నెత్తించేయమని అడిగేందుకు జంకాను,

సాయంత్రం ఆఫీసునించి నేను తిరిగి వచ్చేసరికి, ఇంట్లో నిల్చోడానికి వీల్లేకుండా వుంది పరిస్థితి.

ఇక తప్పదనుకొని విషయం ప్రస్తావించాను ఆయన్తో.

"అబ్బాయ్, మీకేగాదు. మాక్కూడా కొడుతూంది కంపు. కానీ, చూశావే, ఈ మున్సిపాలిటీ ఇలా ఏడుస్తున్నది. సాయంత్రవేళ మున్సిపల్ ఆఫీసుకెళ్ళి వచ్చాము. మాయ రోజులు కాకపోతే, ఎవడు పాకీవాడో, ఎవడు కమీషనరో తెల్సుకోలేక పోయానంటే నమ్ము! మా రోజుల్లో ఇలా వెళ్లి చెబితే, అంగ వచ్చేవాడు స్కావెంజరు. లేకుంటే మరుసటి రోజుకు వాడి ఉద్యోగం వుండేదన్న మాటే! ప్చ్! ఆ రోజులే అంత, కరావు. దేశం ఇలా మట్టిగొట్టుకపోతూంది. ఉద్యోగస్తులకి భయం, భక్తీ రెండు లేవు." లేవు." అంటూ వూదరగొట్టడం మొదలు పెట్టేడాయన. ఆఫీసు బడలిక నించి కోలుకోని నాకు మరింత బోర్ కొట్టింది ఆయన మాటలతో.

భగవంతుడు తక్కున ఓ రోజు ప్రత్యక్షమై ఏకేం కావాలని ఆనందరావుగారినడిగితే-

కరుతొద్దు. కాంచనం వద్దు. మడులొద్దు. మాన్యాలసలే వద్దు.

(కాంతలు ఆ వయసులో అసలు పనికి రారు, పాపం!)

కానీ,

తెల్లదొరలు చల్లగా మమ్మల్ని మరలా పాలించేట్లు అనుగ్రహించు దయామయా, అని ప్రార్థిస్తాడు ఆయన, బహుశా.

అసలు విషయాన్ని ప్రక్కకు నెట్టేసి హరికథ చెబుతున్నందుకు చిరాకేసింది నాకు. చేసేదేమీ లేక ఇంట్లో వెళ్ళి, కాఫీ తాగి, బతుకుజీవుడా అనుకుంటూ కూర్చుండి పోయాను నేను.

ప్రొద్దున్నే నిద్రలేచి, మనిషి నెవడినయినా తీసుకొస్తావని కాలవపక్క గుడిసెలకేసి వెళ్లాను. అప్పటికే, అందరూ కూలీల కెళ్లిపోయారు. ఎలాగైతేనేం, గూడెం అంతా గాలించి ఒకణ్ణి పట్టుకున్నాను. మొహం చూడగానే. కాటికీ కూటికీ, దూరమయి పోయిన వాడిలా అనిపించాడు, బయట ఆరేడుగురు పిల్లలు ఒక కుక్కి మంచం పైన పడున్నారు. గద్దలు కొరుక్కు తిని పారేసిన, ఉడుతపిల్లల్లా విచిత్రంగా, భయంకరంగా వున్నారు వాళ్లు.

నన్ను చూడగానే వాళ్లలో ఒకడు కెవ్వుమని ఏడుపు లంకించుకున్నాడు.

"పోలీసోడు కాదులేరా ఈ బాబు," అంటూ సమాధాన పర్చింది వాళ్ళక్క.

రెండ్రూపాయలిస్తే ఎత్తి పారేస్తానన్నాడు, సరేనని, వెంటబెట్టుకొచ్చాను. ఇంటిముందు వున్న మున్సిపల్ బండినీ, స్కావెంజర్ని చూసేసరికి, నాకాశ్చర్యం వేసింది. పాకీవాడితో ఏదో సీరియస్‌గా మాట్లాడుతున్నారు ఆనందరావు. బహుశా గతించిపోయిన తెల్లగొడుగు లిచ్చిన చల్లని నీడల్ని గురించి చెబుతూన్న ట్లున్నాడు, మహానుభావుడు.

పక్కనున్న మనిషిని చూపించి వచ్చిన పని చెప్పాను, ఆయనతో. సంగతి విన్న ఆనందరావుగారు, మొదట కాస్త విస్తు పోయారు. తర్వాత గట్టిగా నవ్వుకున్నారు.

''ఎంతిస్తానని పట్టుకొచ్చావేంటి?''

''రెండ్రూపాయలు''—

ఈసారి ఆనందరావుగారు బాగా కోప్పడ్డారు,

''ఇదుగో, అబ్బాయ్, వెధవది, చచ్చిన కుక్క నెత్తి పారాయడానికి రెండు రూపాయ లిస్తావా? (బతికిన కుక్కను ఎత్తేస్తే ఇవ్వచ్చు గాబోలు) నువ్వు సంసారం చేస్తావా, లేక సన్యాసం పుచ్చుకుంటావా? నోట్లు అచ్చుగొడుతున్నావేంటి కొంపచేసి? అసలు నీ కంత తొందరెందుకు. పనులంత తొందరగా అయిపోతా యనుకున్నావేంటి? పాకివాడు గూడా మనల్ని దబాయించేవాడాయే!" అని నన్ను మందలించి, నేను తీసుకొచ్చినవాడి మీద విరుచుక పడ్డాడాయన.

"చచ్చిన కుక్కనెత్తేయడానికి రెండు రూపాయలు కావాల్రా నీకు. రెండు రూపాయల్ని ఒక్కసారె నువ్వెప్పుడైనా కళ్ళ జూశావా" అంటూ వాణ్ణి తూర్పార బట్టేశాడు.

''బాబూ,మీతో నాకేంపనండీ, ఈయన నన్ను తీసుకొచ్చాడు,'' అంటూ, ఎదురు చెప్పాడు గూడెం మనిషి.

---

## సరైన సమాధానం


తండ్రి: చదువైంది కదా! ఏం చేద్దామనుకొంటున్నావు?

కొడుకు: అస్థి పంచుకుందామనుకొంటున్నాను.

* * *

తండ్రి: రోజుకు పదిరూపాయలా నీ సోదరు?పవిత్రోో నువ్వు చేసే నిర్వాకం?

కొడుకు: ముక్క కలవటంలేదు గాని, లేకపోతే యిలా అడిగేవాడివేనా నువ్వు?




ముసలాయన ముక్కుపుటాలెగరేశాడు. కనుబొమ్మలు పైకెత్తాడు. గుడ్లు పెద్దవి చేశాడు:

"చూశావా, వీళ్ళకెలా కొవ్వెక్కిపోయిందో. ఈ వెధవ సమాధానం చెప్పే తీరుచూడు. నా ఇంట్లో కుక్కని ఎత్తేయడానికి నాతో పనేమీలేదట వీడికి," అంటూ నాతో పితూరీ చేశాడు.

ఈ రభసలో మున్సిపల్ స్కావెంజర్ వెళ్ళబోయాడు.

"నువ్వెక్కడికి వెళ్ళడం? నిన్నిలా సాగనంపడానికా బొట్టుపెట్టి నేను పిలుకొచ్చింది?" అంటూ దబాయించాడు ఆనందరావు.

"వాడి నోటికాడ కూడు మేం వెలకొట్టుకపోడం. వాడి చేతే ఎత్తించేయండి బాబూ" అంటూ ఎదురు ప్రశ్న వేశాడు స్కావెంజర్.

దీన్తో ముసలాయన గంగవెర్రులెత్తిపోయాడు.

"ఏంటిరా రాస్కెల్' నీ పని నువ్వు సవ్యంగా చేసుకపొమ్మంటే, నీతులు చెబుతూన్నావే! మీకు జీతాలిచ్చి మేపేది వీధులుచిమ్మడానిగా, నీతులు చెప్పడానికా మీరితానంగ కడుపులతో మాడుతూంటే నెత్తికెలా చెప్పులడుగుతూన్నారు, ఇ మీకు అన్నీ శువ్యంగా వుంటే, అసలు జవాబు చెపుతారా? నువ్వీరోజు ఆకుక్కనెలా ఎత్తేయవో నేనూ చూస్తాను.

ఉద్యోగం మీద నిఘావుంటే నువ్వేం నీ నెత్తిమీద పేనుకూడా చెప్పిన మాట వింటుంది. కమీషనర్ క్రిష్ణారావెవరను కుంటున్నావ్? స్వయాను నా మేనల్లుడు, ఇప్పుడు జవాబు చెప్పు, చూద్దాం.'' అని వాడిమీద సవాల్ చేశాడు

ఈదెబ్బకో పాపం స్కావెంజర్ కాస్త మెత్తబడ్డాడు. ఆనందరావు మరింత పుంజుకొన్నాడు.

"పోరా, పో. నీ అబ్బతో చెప్పుకో. రెండు రూపాయలు దూ కావాలి నీకు" అంటూ గూడెంవాడిని కసురుకున్నాడు

పళ్లు పటపట కొరుకుతూ వెళ్ళిపోయాడు వాడు. వాడి మొహం చూడ్డానికి నాకు సిగ్గేసింది.

ఆ సమయంలో ఆనందరావు నోట్లోని చుట్టపక్కన వెలిగిన నవ్వు నాలో భయం కల్గించింది. వస్త్రాపహరణ జరుగుతూన్న సమయంలో దుర్యోధనుడు బహుశా అలాగే నవ్వి వుంటాడు.

సాయంత్రం ఆఫీసు నుంచి తిరిగి వస్తూంటే, వీధి మొదట్లో చచ్చిన కుక్క పడివుంది. కాకులు దాన్ని పొడుచుకు తింటూన్నాయ్, చుట్టూ రక్తం మరకలు, చాలా భీభత్సంగా వుంది, ఆ ప్రదేశం అంతా, గబగబా అడుగు లేసుకుంటూ ఇంట్లోకొచ్చి పడిపోయాను. వెంటనే ఆనందరావుని విషయమేవిటని అడిగాను,

ముసలాయన చాలా కంగారు పడిపోయాడు. కాస్త సంతోషించాడు,

"పోయారు వెధవలిద్దరూ మట్టికొట్టుకొని పోయారు. పళ్లు పొగరెక్కి మంచీ చెడూ లేకుండా, నడిరోడ్లో అలా కొట్టుక చస్తాం అంటే భగవంతుడు హర్షిస్తాడా! అబ్బాయ్, లోకం ఎలా తగలబడిపోతూందో, చూడు' అంటూ మొదలెట్టాడాయన.

ఆయన చెప్పేదేవీ నాకు అర్థంగాక, మరింకాసేపు అక్కడే నిలబడితే, ఊదర గొడతాడని భయపడి మా వాటాలోకెళ్ళి, అసలు విషయం ఏవిటని మా శ్రీమతి నడిగాను.

మున్సిపల్ స్కావెంజర్ చచ్చినకుక్క నీడ్చుకొని పోతూంటే, గూడెం మనిషి దారిలో అటకాయించాడట

"నా కడుపు గొడతావా, గాడిద కొడకా" అంటూ దెబ్బలాటకు దిగాడట. పెద్దయుద్ధం జరిగినంత పనయిపోయిందట. మున్సిపల్ వాడు చేతికి దొరికిన సోడాబుడ్డితో గూడెంవాడి నెత్తిమీద బలంగా కొట్టేడట. అంతే వీడు నడిరోడ్డు మీద నెత్తురు కారుకుంటూ, స్పృహ లేకుండా పడిపోయాడట

ఇదంతా వింటూన్న నాకు కడుపులో దేవినట్లయింది. వికారం పుట్టుకొచ్చింది.

'చివరకేం అయ్యింది? గూడెం మనిషి పరిస్థితి ఎలా వుంది' అని అడిగాను వుండబట్టలేక ఆనందరావుని.

ఆ! ఏమవుతారు, దెబ్బలు తిన్నవాడు ఆస్పత్రిలో చచ్చాడట. ఈ సరికి కాటికి చేరుకుని వుండొచ్చు. కొట్టినవాణ్ని పోలీసులు కొట్లో తోసేశారు. లేకుంటే నడిరోడ్డుమీద అలా కొట్టుక చావడమేంటి? వూరికెనే అన్నారా. వినాశకాలే విపరీత బుద్ధి అని. అంతా ఘోరకలి మాయ రోజులు అంటూ ముగించాడు ఆనందరావు

మనిషి నిలువునా చనిపోతే, కాస్తంత జాలికూడా చెందని ముసలాయనంటే నాకు చాలా జుగుప్స కలిగింది.

కూటికోసం పోట్లాడి, చివరకు కాటికెళ్ళిన గూడెం మనిషి పదే పదే నాకు గుర్తుకొచ్చాడు. చాలా దిగులేసింది.

ఆనందరావు తరచూ అన్న "మాయ" గుర్తుకొచ్చింది.

ఏది మాయ?

రెండు రూపాయల కోసం ఒక నిండు ప్రాణాన్ని బలిపెట్టినతలో ముసలాయన లోభత్వమా? లేక —

కూటికోసం ప్రాణాల్తో చెలగాటం ఆడి, చివరకు కూడక్కర్లేని చోటికెళ్లిన గూడెం మనిషి పేగుల్లోని ఆకలా?

ఏది మాయ? *